# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




వినయంలేని విద్య
సుగుణంలేని రూపం
ఉపయోగం కాని ధనం
శౌర్యంలేని ఆయుధం
ఆకలిలేని భోజనం
పరోపకారం చేయని జీవితం వ్యర్థం


తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | శుక్రవారం | 13.12.2024 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం




# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

- ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ
- క్యాబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం



హైదరాబాద్, ప్రజాభూమి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ మిగతా 2లో...

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

- జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైన కేంద్రం



న్యూఢిల్లీ,డిసెంబర్ 12(ఆర్ఎన్ఎ):

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకే సారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగిం చబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ మిగతా 2లో..

# ఛత్తీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 12మంది మావోయిస్టులు మృతి




బస్తర్,ప్రజాభూమి :

ఛత్తీస్‌ఘఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, 2లో..

## పొరపాట్లకు తావులేకుండా
# సర్వే నిర్వహించాలి

- ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం
- సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం
- కలెక్టర్‌లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్..కీలక ఆదేశాలు జారీ
- ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం వేగంగా అడుగులు
- దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధింపు

2లో



# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

- డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల
- డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

2లో




## రైతుకు బేడీలు వేయడం
# అమానవీయం

- రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం
- లగచర్ల రైతులకు అండగా ఉంటాం
- గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


2లో



## సచివాలయంలో
# ఫేషియల్ రికగ్నిషన్

- కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై మంత్రులు ఆగ్రహం
- ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ప్రతి రోజు తప్పని సరి చేసిన సీఎస్

2లో



# జైలులో గుండెపోటుకు గురయిన లగచర్ల రైతు

- బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు
- తెలంగాణ పోలీసులు మరో దారుణం
- ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ
- ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక

హైదరాబాద్, ప్రజాభూమి



తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

# ఛత్తీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

మొదటి పేజీ తరువాయి

దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

హైదరాబాద్, ప్రజాభూమి

ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు. భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే%ౌ%.అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి%ౌ% ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం%ౌ%.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం%ౌ% చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది.ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

మొదటి పేజీ తరువాయి




చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది.నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.

# సచివాలయంలో ఫేషియల్ రికగ్నిషన్

హైదరాబాద్, ప్రజాభూమి

తెలంగాణ సచివాలయంలో గురువారం నుంచి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫేస్ రికగ్నిషన్‌కు సంబంధించి సీఎస్ శాంతి కుమారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఫేషియల్ రికగ్నేషన్ విధానంపైనే రోజువారి అటెండెన్స్ నమోదు చేయనున్నారు. గురువారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఇది వర్తిస్తోంది. సచివాలయం ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం నుంచి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను తప్పనిసరి చేసింది. అందులో భాగంగా ఇప్పటికే సచివాలయంలోని అన్ని విభాగాల్లో ఫేస్ రికగ్నిషన్ డిజిటల్ మిషన్లను ఏర్పాటు చేసింది. ఉద్యోగులక ుసంబంధించిన ఐడీ నెంబర్లతో సహా ఫేస్‌లను మిషన్‌లో అధికారులు నమోదు చేశారు. గురువారం ఉదయం నుంచే ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యే ముందు ఫేస్ రికగ్నిషన్ మిషన్‌లో తమ అటెండెన్స్ నమోదు చేసుకుని విధులకు హాజరవుతున్నారు. ఇక నుంచి ఉద్యోగుల అటెండెన్స్, వారి జీతభత్యాల చెల్లింపులు ఈ అటెండెన్స్ ద్వారానే జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా రాష్ట్ర సచివాలయం పాలన విభాగానికి గుండెకాయ లాంటిది. అయితే కొంత మంది ఉద్యోగులు సమయా నికి రావడంలేదని, ఇష్టానుసారంగా వస్తున్నారని, 12 గంటల వరకు కూడా కొంతమంది రావడం లేదని.. ఒక వేళ వచ్చినా.. సాయంత్రం 5 గంటలలోపే తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. మంత్రులు కొందరు తమ శాఖల్లోని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉద్యోగులు సమయానికి రావడంలేదని తేలింది. అలా రాని ఉద్యోగుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలులోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల సమయపాలన సెక్రటేరియట్ భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ అమలు నిర్ణయం తీసుకుంది.

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

మొదటి పేజీ తరువాయి

పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

# పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలి

హైదరాబాద్, ప్రజాభూమి

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.
పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ముందు రోజు రాత్రే ప్రజలకు సమచారం ఇవ్వాలని.. స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల విషయంలో పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు.
సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్‌లు సమీక్షించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు మంత్రి.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియని.. ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నట్లు కలెక్టర్లకు మంత్రి పొంగులేని సూచించారు.

# రైతుకు బేడీలు వేయడం అమానవీయం

హైదరాబాద్, ప్రజాభూమి

గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

ప్రజాభూమి

## నూతన పంచాయతీ భవన స్థల పరిశీలన




(ప్రజాభూమి బెజ్జంకి)

మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బెజ్జంకి మండలంలోని వీరాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణం కొరకు స్థల పరిశీలన చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి.నూతన పంచాయతీ భవనం మంజూరు అయిన దృష్ట్యా భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు.అదేవిధంగా వీరాపూర్ బీఎల్ఓ నూతన అంగన్వాడి కేంద్రం నిర్మాణం కొరకు ఎమ్మెల్యేకు తెలుపగ,అతి త్వరలో నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.వీరితో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కర్రావుల సందీప్,స్థానిక నాయకులు గన్నమనేని బాలసుధీర్ రావు,తదితరులు కలరు.

## ప్రకటనలు కాదు కావల్సింది.. పథకాలు

- ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా



హైదరాబాద్, ప్రజాభూమి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతుందని, కావల్సింది ప్రకటనలు కాదని పథకాలని అవి గుర్తుపెట్టుకుంటే మంచిదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొటారన్నారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరెంట్, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.

## పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా

- తమకు సమాచారం ఇవ్వకుండానే ఫైనల్ చేస్తారా
- సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం




హైదరాబాద్, ప్రజాభూమి

పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా వేరే రాష్ట్రానికి వెళ్లారా అని చురక అంటించారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పెన్షన్

- అలంటి చిన్నారులను మూడు నెలల్లో గుర్తించాలి
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశం

అమరావతి,ప్రజాభూమి

ఏపీ సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో ఆలోచించి కీలక నిర్ణయం తీసుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పెన్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో రెండో రోజు కూడా సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగానే, తల్లిదండ్రులు లేని పిల్లల పరిస్థితి పట్ల కలెక్టర్లతో చర్చించారు. రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించే ప్రక్రియ 3 నెలల్లో పూర్తి చేయాలని, వారికి నెలనెలా పెన్షన్ అందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఏటా ఇలాంటి పిల్లల జాబితాను అప్ డేట్ చేయాలని సూచించారు.

# రాజధాని అభివృద్ధికి అడుగులు

- ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు
- అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా మార్చేందుకు నిధులు
- వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణాలకు వెసులుబాటు
- వెసులుబాటు కల్పిస్తూ కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం



అమరావతి,ప్రజాభూమి

రాజధాని అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు చేసింది. అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి రుణం మంజూరు చేసినట్టు ఏడీబీ స్పష్టం చేసింది. మొత్తం 121.97 బిలియన్ల జపనీస్ యెన్‌లను మంజూరు చేసినట్టు ఏడీబీ వెల్లడించింది. రాజధాని నిర్మాణానికి నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిధులు సమకూర్చుకునేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణం తీసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ.. కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. రూ. 15,000 కోట్లలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ కలిసి రూ. 13,500 కోట్లను రుణంగా ఇస్తున్నాయి. మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. రూ. 13,500 కోట్ల రుణాన్ని ఐదేళ్లపాటు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఐదేళ్ల తర్వాత చెల్లింపు మొదలవుతుంది. ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాలపాటు రుణం చెల్లించాలి. నిధులతో ప్రభుత్వం కీలక పనులు చేపట్టనుంది. అమరావతి ప్రాంతాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడానికి, ఆ ప్రాంత వాసుల జీవన ప్రమాణాలు పెంచడానికి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు మేలు చేయడానికి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులను ప్రభుత్వం వినియోగించనుంది.ఈ రుణం మంజూరుపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇండియా కంట్రీ డైరెక్టర్ మియో ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులోను మరిన్ని నగరాల అభివృద్ధి జరగబోతోందని.. వాటికి అమరావతి రోల్ మాడల్‌లో మారబోతోందని వ్యాఖ్యానించారు.గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా.. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. పచ్చని ప్రదేశాలు ఉండేలా చూస్తారు. నీరు, పారిశుద్ధ్య సేవలు, తక్కువ కార్బన్ రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. వరద ప్రమాదాలను తగ్గించడానికి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తారు. పెట్టుబడిదారులను తీసుకురావడంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తారు. ప్రైవేట్ పెట్టుబడిని సృష్టించి మహిళలు, యువతకు ప్రయోజనం చేకూర్చే కొత్త ఉద్యోగాలను సృష్టిస్తారు.

## ముగిసిన సీఎం కప్ క్రీడల పోటీలు

ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర:

సీఎం కప్ ఆటల పోటీల ముగింపులో భాగంగా మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులకు అథ్లెట్స్ పోటీలను న్యాలకొండపల్లి లోని తెలంగాణ మోడల్ స్కూల్ లో






నిర్వహించడం జరిగింది. అథ్లెట్స్ పోటీలో భాగంగా రన్నింగ్, త్రో బాల్, జంపింగ్ విభాగాలలో పోటీలు





నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంచార్జ్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ లు, పి టి లు బాబు శ్రీనివాస్, హరికిషన్, రవీందర్, రాజబాబు, కృష్ణవేణి, నాగార్జున, దిలీప్, జాతీయ క్రీడాకారుడు లొకిని నరేష్, పాల్గొన్నారు.

## అంగరంగ వైభోగంగా అయ్యప్ప స్వామి అభిషేకాలు





ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్

ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం మణికంఠ సన్నిధానం వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభోగంగా అయ్యప్ప స్వామి అష్టభిషేకాలను రాజు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గణపతి హెూమం అనంతరం అయ్యప్ప స్వామికి పాలాభిషేకం, పెరిగాభిషేకం,నెయ్యాభిషేకం, గంధాభిషేకం, బస్మాభిషేకం, పన్నీర్ అభిషేకం పుష్పాభిషేకం కనిక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం గురుస్వామి, బాలాజీ స్వామి సంతోష్ స్వామి, రాజేందర్ స్వామి, కాలభైరవరాజు స్వామి,తెర్లు మద్ది రాజు స్వామి, దెబ్బెడ రాజు స్వామి, అజయ్ స్వామి, విజయ్ స్వామి, కూర సంతోష్ స్వామి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దేవేందర్, కొండాపూర్ రాజు, నందకుమార్ కృష్ణమూర్తి, నరసయ్య,కుబేర శ్రీకాంత్,కుందన్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 1నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

- మార్చి 3నుంచి ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు
- పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసిన ఏపీ విద్యాశాఖ

అమరావతి, ప్రజాభూమి

ఏపీ ఇంటర్మీడియేట్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు కొనసాగనున్నాయని విద్యాశాఖ తెలిపింది. అలాగే మార్చి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ..



పరీక్ష లు రాసే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

## ముదిరాజ్ మండల అధ్యక్షుడిగా నర్సయ్య



ప్రజాభూమి ప్రతినిధి వేములవాడ అర్బన్

వేములవాడ అర్బన్ ముదిరాజ్ మండల అధ్యక్షుడిగా తునికి నర్సయ్యను గురువారం ఎన్నుకున్నట్టు కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా రుద్రవీణ రవి, ప్రధాన కార్యదర్శిగా చొక్కాల శ్రీనివాస్, కార్యదర్శిగా రెడ్డవేని రాజులను ఎన్నుకున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా నాయకులు చొక్కాల రాము, బొజ్జ కనకయ్య, తునికి మల్లయ్య, చొక్కాల శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో షార్ట్ ఫిలిం షూటింగ్‌ను ప్రారంభించిన సొల్లు అజయ్ వర్మ...



ప్రజాభూమి ప్రతినిధి తిమ్మాపూర్

తిమ్మాపూర్ గ్రామంలో లో కట్ట కింది పొలం కౌలుకిస్తే అనే షార్ట్ ఫిలిం షూటింగ్ ను బిజెపి రాష్ట్ర నాయకులు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ ప్రారంభించారు. దూలం థియేటర్ యూట్యూబ్ ఛానల్ లో దూలం తిరుపతి గౌడ్ నిర్మాణ సారధ్యంలో డైరెక్టర్ రాము రామ్మోహన్ ఈ షార్ట్ ఫిలింను తెరకెక్కిస్తున్నారు. ఇట్టి లఘు చిత్రం షూటింగ్లో యాక్టర్స్ దూలం తిరుపతి గౌడ్, క్రిటిక శ్రీ కోడి శ్రీనివాస్, పురుషోత్తం, జగదీష్ హరీష్ ,కెమెరామెన్ సంతోష్ యాదవ్ తదిరులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరు కాలేకపోతున్నా మరో తేదీ ఇవ్వండి

- నాగార్జున 'పరువు నష్టం కేసులో కోర్టుకు తెలిపిన కొండా సురేఖ



హైదరాబాద్, ప్రజాభూమి

సినీ నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం కేసులో తాను కోర్టుకు హాజరుకాలేకపోతున్నానని, మరో తేదీ ఇవ్వాలని తెలంగాణ మంత్రి కొండా సురేఖ కోర్టును కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను వాయిదా వేసింది. తన పై చేసిన వ్యాఖ్యలకు గాను నాగార్జున మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో మంత్రికి ఇదివరకే కోర్టు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.అయితే మంత్రిగా వివిధ కార్యక్రమాల కారణంగా సురేఖ విచారణకు హాజరు కాలేకపోతున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరో తేదీ ఇస్తే హాజరవుతారని కోర్టుకు తెలిపారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

# జర్నలిస్ట్‌ను నేను కొట్టడం తప్పే

- మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు
- ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది
- మీడియా ముసుగులో నాపై దాడికి అవకాశం ఉందని ఆలోచించా
- జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నా
- ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు
- అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నా
- కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు?
- నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తా
- ఐ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు
- మరో ఆడియో వదిలిన మోహన్ బాబు



హైదరాబాద్, ప్రజాభూమి

జల్‌పల్లిలోని తన నివాసంలోకి మంచు మనోజ్ వెంట చొరబడిన జర్నలిస్ట్‌పై దాడి చేయడం తప్పేనని సీనియర్ నటుడు మోహన్ బాబు అంగీకరించారు. మంచు ఫ్యామిలీలో గత ఐదు రోజుల నుంచి వివాదం కొనసాగుతుండగా.. మంగళవారం రాత్రి గేట్లు తోసుకుంటూ తన అనుచరులు, మీడియా సభ్యులతో కలిసి మంచు మనోజ్ ఇంట్లోకి ప్రవేశించాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మోహన్ బాబు ముందు మైక్ పెట్టిన ఒక జర్నలిస్ట్.. 'ఈ ఇష్యూపై మీరు ఏం చెప్తారు?' అని ప్రశ్నించారు. దాంతో సహనం కోల్పోయిన మోహన్ బాబు.. ఆ మైక్‌ను తీసుకుని జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ తలకి గాయమై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్ట్‌పై దాడి తర్వాత మోహన్ బాబు కూడా అస్వస్థతకి గురై.. ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన మోహన్ బాబు.. ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో ఫ్యామిలీ వివాదంపై క్లారిటీ ఇవ్వడంతో పాటు జర్నలిస్ట్‌పై దాడి, దానికి గల కారణాన్ని కూడా మంచు మోహన్ బాబు వెల్లడించారు. దాడి ఘటనపై చింతిస్తున్నట్లు కూడా ఆయన చెప్పుకొచ్చారు. "మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు. ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది. మీడియా ముసుగులో నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా.. జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నాను. ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు.. అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నాను. కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తాను. నిజ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు" అని మంచు మోహన్ బాబు వెల్లడించారు. 'నా ఇంట్లోకి చొరబడి నా ప్రశాంతతని దెబ్బతీశారు. ఒకవేళ నేను నా ఇంటి గేటు బయట అలా దాడి చేసి ఉంటే నాపై కేసులు పెట్టి అరెస్ట్ చేసుకోవచ్చు. అంతెందుకు నేనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోతా. మా కుటుంబంలోని సమస్యని పరిష్కరించుకోవడానికి ఎవరూ మధ్యవర్తులు అవసరం లేదు. మేము కూర్చొని మాట్లాడుకుని .. సమస్యని పరిష్కరించుకుంటాం" అని మంచు మోహన్ బాబు ధీమా వ్యక్తం చేశారు. "మీడియాలో కేవలం నేను కొట్టిన విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. నిజమే.. నేను అలా కొట్టడం తప్పే. కానీ.. ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలి కదా? నేను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. అవన్నీ వదిలేసి.. కేవలం కొట్టిన విషయాన్నే పదే పదే ప్రస్తావిస్తున్నారు" అని మంచు మోహన్ బాబు మండిపడ్డారు. జల్‌పల్లిలో ప్రైవేట్ బౌన్సర్లతో మంచు మనోజ్, మంచు విష్ణు అక్కడ భయానక వాతావరణ సృష్టించారు. దాంతో ఇప్పటికే ఈ ఇద్దరిపై సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసిన పోలీసులు.. మోహన్ బాబుని కూడా విచారణకి పిలిచారు. కానీ.. తెలంగాణ హైకోర్టు నుంచి డిసెంబరు 25 వరకూ పోలీసుల విచారణ నుంచి మోహన్ బాబు మినహాయింపు తెచ్చుకున్నారు.

# కోర్టులో మతపరమైన పిటిషన్ల నిరాకరణ

- మతపరమైన స్థలాలపై వ్యాజ్యాలను స్వీకరించకూడదు
- పెండింగ్ కేసులపైనా తీర్పులు ఇవ్వొద్దు!
- దిగువ న్యాయస్థానాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ,పజాభూమి

దేశ వ్యాప్తంగా పలుచోట్ల వివిధ ప్రార్థనా స్థలాల్లో నిర్వహిస్తున్న సర్వేలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్న తరుణంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని, అలాగే ఎలాంటి ఆదేశాలు జారీ చేయరాదని స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాల చట్టం-1991కి సంబంధించి అనుకూలంగా, ప్రతికూలంగా దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఆయనతోపాటు వివిధ పార్టీల నాయకులు జితేంద్ర అహ్వాద్, శరద్‌పవార్, మనోజ్ కుమార్ ఝా తదితరులు కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. కేంద్రం ప్రతిస్పందన తర్వాత ఇతర పార్టీలు రీజాయిండర్ దాఖలు చేయటానికి మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఆ తర్వాతే ఈ విషయంపై విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ అంశానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల్లోనూ ఎలాంటి తీర్పులు, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని అన్ని జిల్లా కోర్టులు, హైకోర్టులను దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ సందర్భంగా జ్ఞానవాపి, మధుర షాహీ ఈద్గా, సంభల్ మసీదు అంశాలను ప్రస్తావించింది. కేంద్రం తన స్పందనను తెలియజేసే వరకు ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఏదైనా ప్రార్థనా స్థలాన్ని మార్చటాన్ని నిషేధిస్తుంది. అయితే 1947 ఆగస్టు 15న ఉన్న ఏ ప్రార్థనా స్థలం ఏదైనా అలాగే కొనసాగేందుకు అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రార్థనా స్థలాల చట్టం 1991ని పరిశీలిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే విచారణ చేయకుండా ఆదేశాలు జారీ చేయరాదంటూ ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను హిందువుల తరఫున న్యాయవాదులు వ్యతిరేకించారు.

# రాయలసీపై అల్పపీడన ప్రభావం

- చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు
- స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించిన కలెక్టర్

అమరావతి,పజాభూమి



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షంతో శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ రోడ్డులో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని టీటీడీ అధికారులు సూచించారు. కొండచరియలు విరిగేపడే ప్రమాదం ఉండడంతో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది సూచించారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. తిరుమల గోగర్భం, పాపవినాశనం జలశయాలు పూర్తిగా నిండటంతో నీరు ఔట్ ఫ్లో అవుతోంది. బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం శ్రీలంక తీరంలో నైరుతి బంగాళాఖాతం మీదుగా పయనిస్తోంది. ఉంది దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా శ్రీలంక-తమిళనాడు తీరాల వైపు కదులుతూ కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. అల్పపీడన ప్రభావంతో డిసెంబర్ 12, గురువారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల అనంతపురం, శ్రీ సత్య సాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. అల్పపీడన ప్రభావంతో ప్రభావంతో డిసెంబర్ 15 వ తేది వరకు కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా,గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం మరియు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మీ ప్రాంతంలో వ్యవసాయ సంబంధిత ఇతర సందేహాలు నివృత్తి కోసం మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోతకి సిద్దంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదని సూచించారు. కోసిన పూర్తిగా ఆరని పనలను వర్షాల నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్ట శాతాన్ని నివారించుకోవచ్చని అధికారులు సూచించారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు పంట పొలాల్లో నిలిచే అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలలో ఉంచాలని, ఉద్యానవన పంట మొక్కలు/చెట్లు పడిపోకుండా నిలబ దేందుకు కర్రలు/బాదులతో సపోర్ట్ అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్ పై దృష్టి సారించాలి

- కలెక్టర్లకు మంత్రి నారా లోకేశ్ ఆదేశం
- అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం

అమరావతి,పజాభూమి

గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయా లు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారు లంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికా హారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి. ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం. అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. సాంకేతిక సమస్యలు అధిగమించి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని మంత్రి లోకేశ్ కోరారు.

## కేసీఆర్ నాయకత్వంలోనే బయ్యారం ఉద్యమం

- అక్కడ పరిశ్రమను ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి : కవిత



హైదరాబాద్,ప్రజాభూమి

బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అప్రమత్తంగా ఉండాలన్న హోంమంత్రి అనిత



అమరావతి,ప్రజాభూమి

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కారణంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీనిపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనిత అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లు, కొండచరియలు ఉండే ప్రాంతాల్లో ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపాలని సూచించారు. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం రాగల 24 గంటల్లో బలహీనపడుతుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది.

## ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు..

- ప్రభుత్వానికి భారీగా సమకూరిన ఆదాయం



అమరావతి,పజాభూమి

కొత్తగా మద్యం విధానం అమల్లోకి రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. కొత్త విధానం అమల్లోకి వచ్చిన రోజే వైన్స్, బార్లకు బారులు తీరారు. ఫలితంగా మూడు నెలల్లోనే రికార్డు స్థాయిలోనే భారీగా విక్రయాలు జరిగాయి. మందుబాబులకు మందు.. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల్లో తీవ్రంగా ప్రభావితం చేసిన మద్యం విధానం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. బ్రాండెడ్ మద్యం.. అన్ని రకాల బ్రాండ్ మద్యం అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. కొత్త మద్యం విధానం అమల్లోకి రావడంతో భారీగా అమ్మకాలు జరిగాయి. ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో అక్టోబర్ 16వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 3,300 దుకాణాల్లో విక్రయాలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు రూ. 4,677 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చాక 61.63 లక్షల కేసుల మద్యం తాగేశారు. 19.33 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి. మద్యం విక్రయాలు భారీగా జరగడంతో మందుబాబులు పండుగ చేసుకోగా.. ప్రభుత్వానికి భారీగా మద్యం నుంచి ఆదాయం లభించింది. కొత్త సంవత్సరం.. సంక్రాంతి పండుగకు ఊహించని రీతిలో మద్యం విక్రయాలు ఉంటాయని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

# మోహన్ బాబు మీడియాకి క్షమాపణలు చెప్పాలి

- మోహన్ బాబు కొడుకు మీడియాను పిలిచాడు
- అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది
- మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది
- కానీ మీరే ఇంటి ఇష్యూని పబ్లిక్‌లో పెట్టేశారు
- బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, ప్రజాభూమి

మంచు ఫ్యామిలీ వివాదం గంటకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ వివాదంలోకి రాజకీయ నాయకులు ఎంట్రీ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మంచు ప్యామిలీ ఇష్యూ గురించి కీలక వ్యాఖ్యాలు. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలని సూచించారు. రాజాసింగ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.'మోహన్ బాబు మీడియాకి క్షమాపణలు చెప్పాలి. మోహన్ బాబు కొడుకు మీడియాను పిలిచాడు. అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది. మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది.. కానీ పబ్లిక్‌లో పెట్టేశారు. మోహన్ బాబుకి నా సజెషన్.. ఈ ఇష్యూని ఇలానే వదిలేస్తే చాలా పెద్దది అవుతుంది. మీరు మీడియాకి క్షమాపణలు చెప్పాలి.. గాయాలైన రిపోర్టర్‌ను వెళ్లి కలవండి' అని బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సూచించారు. మోహన్ బాబు దాడిలో గాయపడ్డ జర్నలిస్ట్ రంజిత్‌కు యశోద ఆస్పత్రిలో సర్జరీ జరిగింది. జైగోమాటిక్ బోన్‌ను వైద్యుల బృందం సరిచేసింది. కంటికి, చెవికి మధ్య మూడు లెవెల్స్‌లో ఫ్రాక్చర్లు అయ్యాయి. జైగోమాటిక్ ఎముక మూడు చోట్ల విరిగింది. ఫ్రాక్చర్లు అయిన చోట సర్జరీ చేసి.. స్టీల్ ప్లేట్ అమర్చారు యశోద ఆస్పత్రి వైద్యులు. రంజిత్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు చెబుతున్నారు. అటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మోహన్ బాబు.. డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్న మోహన్‌బాబుకు.. వైద్యులు చికిత్స అందించారు. అటు మోహన్ బాబుపై పహాడీ షరీఫ్ పోలీసులు అటెంప్ట్ కేసు నమోదు చేశారు. ఓ టీవీ ఛానెల్ ప్రతినిధిపై దాడి ఘటనలో మోహన్ బాబుపై మొదట బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుపై లీగల్ ఒపీనియన్ తీసుకున్న తెలంగాణ పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో కాస్త ఊరట లభించింది. పోలీసుల ఎదుట విచారణ నుంచి మినహాయింపు ఇస్తూ.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంచు కుటుంబ వ్యవహారం, మీడియాపై మోహన్ బాబు దాడి ఘటనపై విచారణకు హాజరుకావాలని రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. మీడియాపై దాడికి సంబంధించి మోహన్ బాబుపై కేసు కూడా నమోదైంది. అయితే.. పోలీసుల నోటీసులపై మోహన్ బాబు హైకోర్టును ఆశ్రయించారు. మంచు ఫ్యామిలీ వివాదం నడుస్తున్న నేపథ్యంలో.. సోషల్ మీడియాలో మంచు లక్ష్మి మరో పోస్ట్ చేశారు. ప్రపంచంలో ఏదీ మీది కానప్పుడు.. ఏం కోల్పోతారని భయపడుతున్నారంటూ ట్వీట్ చేశారు. మోహన్ బాబుపై కేసు నేపథ్యంలో మంచు లక్ష్మి పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ పోస్టు చేశారనే చర్చ జరుగుతోంది.

## వజ్రాల కిరీటాన్ని విరాళం ఇచ్చిన ముస్లిం కళాకారుడు



న్యూఢిల్లీ, ప్రజాభూమి

మతసామరస్యానికి ప్రతీకగా ఓ ముస్లిం కళాకారుడు భక్తిని చాటుకున్నాడు. తమిళనాడులోని తిరుచ్చిలో గల ప్రఖ్యాత శ్రీరంగం రంగనాథర్ ఆలయానికి 600 వజ్రాలతో ప్రత్యేకంగా తయారు చేసిన కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. ముస్లిం అయిన జహీర్ హుస్సేన్.. భరతనాట్య కళాకారుడు. తన ప్రదర్శనల ద్వారా వచ్చిన మొత్తాన్ని కొద్దికొద్దిగా సేవ్ చేసి ఈ కిరీటాన్ని తయారు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుందర్ భట్టర్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జహీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. తనకు ముస్లిం, హిందూ, క్రిస్టియన్ అనే తేడా లేదని తెలిపారు. ఈ కిరీటాన్ని గోపాల్ దాస్ అనే కళాకారుడు రూపొందించినట్లు చెప్పారు. దీన్ని రూపొందించేందుకు దాదాపు ఎనిమిదేళ్లు పట్టినట్లు వెల్లడించారు. 3,169 క్యారెట్ల బరువున్న ఒకే రూబీ రాయితో ఈ కిరీటాన్ని తయారు చేసినట్లు చెప్పారు. ప్రపంచంలోనే ఈ రకమైన మొదటి కిరీటం ఇది అని తెలిపారు.

## సోరస్, అదానీ అంశాలపై పార్లమెంట్‌లో గందరగోళం



న్యూఢిల్లీ,ప్రజాభూమి

లోక్‌సభలో గురువారం కూడా గందరగోళం నెలకొన్నది. సభ ప్రారంభమైన క్షణం నుంచి అధికార, విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులు ఉన్నట్లు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ఉధృతం చేశారు. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశీకాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్, కాంగ్రెస్ కలిసి పనిచేస్తోందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఒంటి గంట, ఆ తర్వాత రెండు గంటల వరకు సభను వాయిదావేశారు.

## ఓటర్లను ఆకర్షించేందుకు
## ఆప్‌ఆద్మీపార్టీ హామీల వర్షం

- ఎన్నికల్లో గెలిస్తే ప్రతి మహిళకు రూ.2,100



న్యూఢిల్లీ,ప్రజాభూమి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడు పెంచింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ప్రకటిస్తోంది. ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు కీలక హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకూ నెలకు రూ. 2,100 అందజేస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. గురువారం సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'ప్రతి మహిళకు రూ. 1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చాము. అయితే, కొంతమంది మహిళలు నా వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా రూ. 1,000 సరిపోవడం లేదని చెప్పారు. అందుకే వారి అభ్యర్థన మేరకు 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ. 2,100 ఇస్తాం' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలోకే ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు వెల్లడించారు.

## వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు నిరసన సెగ

హైదరాబాద్, ప్రజాభూమి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు మరోసారి నిరసన సెగ తగిలింది. తాండూర్ లోని గిరిజన బాలికల వసతి గృహంలో బాలికలకు వైద్య చికిత్స పరిశీలనకు జిల్లా కలెక్టర్ వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతరేకంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనారోగ్యానికి గురైన బాలికలకు ఆసుపత్రిలో చికిత్స అందించాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. మూడు రోజుల క్రితం వసతిగృహంలో 16 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు.

## మంత్రి జ్యోతిరాధిత్య సింధియాపై అనుచిత వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పిన కళ్యాణ్ బెనర్జీ

న్యూఢిల్లీ,ప్రజాభూమి



టెలికాం శాఖమంత్రి జ్యోతిరాధిత్య సింధియాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ. డిజాస్టర్ మేనేజ్మెంట్ బిల్లుపై బుధవారం చర్చ జరిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఓ బిల్లుపై చర్చ సమయంలో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఆ సమయంలో కళ్యాణ్‌బెనర్జీ మాట్లాడుతూ.. జ్యోతి రాధిత్య అందాన్ని వర్ణించారు. ఆ ఆవేశంలోనే ఆయన లేడీకిల్లర్ అంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి తప్పు పట్టారు. ఎంపీ కళ్యాణ్ బెనర్జీ క్షమాపణలు చెప్పాలని సింధియా డిమాండ్ చేశారు. అయితే టీఎంసీ ఎంపీ కళ్యాన్ బెనర్జీ.. లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పినట్లు గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. బుధ వారం జరిగిన ఘటన దురదృష్టకరమని, ఎవరు కూడా వ్యక్తిగత ఆరోపనలు చేయరాదు అన్నారు. మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు అని, అది వారి హుందాతనాన్ని భంగ పరుస్తుందని తెలిపారు.

## సచివాలయంలో ఫేషియల్ రికగ్నేషన్


హైదరాబాద్,ప్రజాభూమి

తెలంగాణ సచివాలయంలో గురువారం నుంచి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫేస్ రికగ్నిషన్‌కు సంబంధించి సీఎస్ శాంతి కుమారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఫేషియల్ రికగ్నేషన్ విధానంపైనే రోజువారి అటెండెన్స్ నమోదు చేయనున్నారు. గురువారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఇది వర్తిస్తోంది. సచివాలయం ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

గురువారం నుంచి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను తప్పనిసరి చేసిం ది. అందులో భాగంగా ఇప్పటికే సచివాలయంలోని అన్ని విభాగాల్లో ఫేస్ రికగ్నిషన్ డిజిటల్ మిషన్లను ఏర్పాటు చేసింది. ఉద్యోగులకుసంబంధించిన ఐడీ నెంబర్లతో సహా ఫేస్‌లను మిషన్‌లో అధికారులు నమో దు చేశారు. గురువారం ఉదయం నుంచే ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యే ముందు ఫేస్ రికగ్నిషన్ మిషన్‌లో తమ అటెండెన్స్ నమోదు చేసుకుని విధులకు హాజరవుతున్నారు. ఇక నుంచి ఉద్యోగుల అటెండెన్స్, వారి జీతభత్యాల చెల్లింపులు ఈ అటెండెన్స్ ద్వారానే జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా రాష్ట్ర సచివాలయం పాలన విభాగానికి గుండెకాయ లాంటిది. అయితే కొంత మంది ఉద్యోగులు సమయానికి రావడం లేదని, ఇష్టానుసారంగా వస్తున్నారని, 12 గంటల వరకు కూడా కొంతమంది రావడం లేదని.. ఒక వేళ వచ్చినా.. సాయంత్రం 5 గంటలలోపే తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. మంత్రులు కొందరు తమ శాఖల్లోని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉద్యోగులు సమయానికి రావడంలేదని తేలింది. అలారాని ఉద్యోగుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యం లో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలులోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల సమయపాలన సెక్రటేరియట్ భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ అమలు నిర్ణయం తీసుకుంది.

## 175 నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటు

- యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం
- నారా చంద్రబాబు నాయుడు




అమరావతి,ప్రజాభూమి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా పరిశ్రమల శాఖపై ఆ శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎంతమంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించారన్నది ముఖ్యమని వ్యాఖ్యానించారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాల్సి ఉందని వెల్లడించారు. భూసేకరణ సమయంలో స్థానిక రైతులను కూడా భాగస్వాములను చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమ, రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రిఫైనరీ ఇలా వేర్వేరు పరిశ్రమలకు భూమి అవసరమని పేర్కొన్నారు. అమరావతి తరహాలోనే రైతులను పరిశ్రమలకు భూములిచ్చే అంశంలో భాగస్వాములను చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. వివిధ రంగాల్లో ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలను ఎన్యుమరేషన్ చేయించే పని త్వరితగతిన పూర్తి కావాలని సూచించారు. ఒక పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తి మరో పరిశ్రమకు ముడి సరుకు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై కేబినెట్ సబ్ కమిటీ కూడా వేశారని మంత్రి లోకేష్ అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ప్రతీ పెట్టుబడి విషయంలోనూ కలెక్టర్లు జాగ్రత్తగా డీల్ చేయాలన్నారు. ఆర్సెలార్ మిట్టల్‌కు ఎన్ఎండీసీ ముడి ఇనుము ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని.. పైప్ లైన్ ద్వారా ముడి ఇనుము ఖనిజం వచ్చేలా చేయాలని కోరుతున్నారని లోకేష్ తెలిపారు.ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం ఉక్కుమంత్రికి, ఎన్ఎండీసీకి స్వయంగా నేనే ఫోన్ చేసి ఫాలోఅప్ చేస్తున్నాని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. కలెక్టర్లు కూడా పెట్టుబడుల విషయంలో ఇదే తరహాలో సీరియస్‌గా ఫాలోఅప్ చేయాలని సూచించారు. "నేను మంత్రిని, కలెక్టర్‌ను అంతా నా దగ్గరకే రావాలన్న ఆలోచన వదిలేయాలి" అని సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన ఇబ్బందుల కారణంగా ఏపీకి మళ్లీ రాబోమని వెళ్లిపోయారని దాన్ని సరిదిద్దేందుకు నానా తంటాలు పడుతున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు ఆలస్యమైతే వారికి వయబిలిటీ విషయంలో ఇబ్బందులు వస్తాయని ఆ కారణంగా ఇతర రాష్ట్రాలవైపు వారు చూసే అవకాశం ఉందన్నారు. అందుకే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై పదేపదే చెబుతున్నట్టు వెల్లడించారు. పర్యాటకం కూడా ఉపాధి కల్పనలో కీలకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఐటీలో విప్లవాత్మక మార్పులు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి,ప్రజాభూమి




గూగుల్ ఒప్పందం రాష్ట్రానికి శుభ పరిణామం, ఐటీలో విప్లవాత్మక అభివృద్ధి నాంది అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఐటీ మంత్రి నారా లోకేష్ చేసిన కృషితో గూగుల్ కంపెనీ విశాఖపట్నానికి వస్తోందని తెలిపారు. ఏఐ రంగంలో ఏపీ తొలి అడుగు వేయబోతుందని అన్నారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనుందని తెలిపారు. విద్యార్థులు, డెవలపర్లకు ఏఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10వేలమందికి గూగుల్ ఎసెన్షియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సు అందిస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌తో కీలక భాగస్వామిగా ఉంటామని ప్రఖ్యాత ఐటీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. విశాఖపట్నంలో గూగుల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) సేవలు అందించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జీజీఏఐ) వైస్ ప్రెసిడెంట్ వికాశ్ కోలే బృందం సమావేశమైంది. చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. పెట్టుబడులు ఏ స్థాయిలో పెట్టాలనుకుంటున్నారు, విశాఖ సహా రాష్ట్రంలోని ఇతర ప్రదేశాల్లో ఎక్కడెక్కడ తమ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నారో వికాస్ వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ చేసుకున్న ఒప్పందం, ఆ తర్వాత విశాఖలో వికాస్ పర్యటన గురించి చర్చ జరిగింది. అమెరికా పర్యటనలో గూగుల్‌ను మంత్రి లోకేశ్ సందర్శించడం, రాష్ట్రానికి ఏఐ సేవలు అందించాలంటూ ఆహ్వానించడం వంటి అంశాలూ ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని వికాస్ వెల్లడించారు. మంత్రి లోకేశ్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో జరిపిన సంప్రదింపుల తర్వాత రాష్ట్రంతో వ్యూహాత్మకంగా కలసి ముందుకు వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో గూగుల్ కార్యకలాపాలను చేపట్టడం, అందునా విశాఖలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. రిలయన్స్, నిప్పాన్ స్టీల్స్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్ వంటి సంస్థలు రాష్ట్రానికి రావడంపై చర్చ సాగింది.

# ఏపీలో చాలా మంది అనర్హులకు పెన్షన్

- అనర్హుల నుంచి పెన్షన్ రికవరీ చేయండి
- ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

అమరావతి,ప్రజాభూమి



ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్ అణుబాంబు పేలేలా కనిపిస్తోంది. ప్రభుత్వం పెన్షన్ విషయంలో చాలా సీరియస్‌గా ఉంది. అనర్హులను పెన్షనర్ల జాబితా నుంచి తొలగించడమే కాదు.. వారికి ఇచ్చిన పెన్షన్ డబ్బులను కూడా వెనక్కి తీసుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో చాలా మంది అనర్హులు పెన్షన్ తీసుకుంటున్నారన్న చంద్రబాబు.. ఇందుకోసం బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చారనీ, ఇలాంటి సర్టిఫికెట్లతో పెన్షనర్లుగా జాబితాలో చేరి, అక్రమంగా పెన్షన్ మనీ పొందుతున్నారని అన్నారు. ఇలాంటి వాళ్లందరి దగ్గరా పెన్షన్ మనీని రికవరీ చెయ్యాలని అధికారులకు చెప్పారు. సీఎం చంద్రబాబు మరో మాట కూడా అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లపై చట్టపరంగా చర్యలు (ప్రాసిక్యూట్) తీసుకోవాలి అని అన్నారు. ప్రత్యేకంగా కొన్ని ఆస్పత్రుల నుంచే బోగస్ సర్టిఫికెట్లు వస్తున్నాయన్న చంద్రబాబు.. అలాంటి ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. మెడికల్ బోర్డుల నుంచి బోగస్ సమర్టిఫికెట్లు ఇస్తున్నారన్న చంద్రబాబు.. ఈ మొత్తం వ్యవస్థను సరిచెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనర్హులైన పెన్షనర్లను గుర్తిస్తుంది. వారిని పెన్షనర్ల జాబితా నుంచి తొలగిస్తుంది. ఈ కార్యక్రమం మార్చి 31, 2025 నాటికి పూర్తవుతుంది. ఇలా అనర్హులై, బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి పెన్షన్ పొందిన వారిని గుర్తించడమే కాదు.. వారు తిరిగి ఆ పెన్షన్ మనీని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల అనర్హులకు ఇకపై టెన్షన్ తప్పదు. వారు తిరిగి మనీ చెల్లించాలంటే.. వారికి ఎక్కడి నుంచి వస్తుంది ఇది పెద్ద దుమారం రేగేలా ఉంది. అనర్హులు.. బోగస్ సర్టిఫికెట్లు ఇస్తే.. మరి అధికారులు ఎలా ఆమోదించారు ఆ సర్టిఫికెట్లను పరిశీలించి, అవి బోగస్‌వి అని ఎందుకు గుర్తించలేదు అధికారులు చేసిన తప్పు వల్ల.. ఇప్పుడు అనర్హులు పెన్షన్ పొందుతున్నట్లు అవుతోంది. ఇప్పుడు వారి నుంచి మనీ రికవరీ చెయ్యాలని ఆదేశిస్తే, అప్పుడు.. బోగస్ సర్టిఫికెట్లను ఆమోదించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అధికారులు అనర్హులకు పెన్షన్లు ఇచ్చారని కూటమి ప్రభుత్వం అంటోంది. మరి అప్పటి అధికారులు ఎందుకు అనర్హులకు పెన్షన్ ఇచ్చారో, ఎందుకు అనర్హులను, అర్హులుగా గుర్తించారో చెప్పాలి. ఎందుకంటే.. ఇది పెద్ద స్కామ్ లాగా కనిపిస్తోంది. 63 లక్షల మందిలో ఎంత మంది అనర్హులు ఉన్నారో తేలాలి. వారికి ప్రతీ నెలా అక్రమంగా మనీ పోతున్నట్లే. అదంతా ప్రజల డబ్బు. అక్రమంగా, అన్యాయంగా అనర్హులకు ఇవ్వడం సరైనది కాదు. అయితే, అనర్హులను అర్హులుగా చేసిన పాపం అధికారులది. కాబట్టి.. అసలు తప్పంతా అధికారుల దగ్గరే ఉన్నట్లు లెక్క. చర్యలు తీసుకుంటే వారిపై తీసుకోవాలి. ప్రజలపై కాదనే వాదన ఉంది. మొత్తంగా పెన్షన్ల వ్యవహారం ఇప్పుడు ఏపీలో పెను దుమారం రేపుతోంది. జనవరిలో ఎంతమందికి పెన్షన్ వస్తుందో, ఎంతమందికి కట్ అవుతుందో అనేది హాట్ టాపిక్ అయ్యింది.

# వైసీపీ మరో దెబ్బ

- పార్టీని వీడిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్



అమరావతి,ప్రజాభూమి

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. ఆ క్రమంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త విజయసాయిరెడ్డికి పంపానన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని వైఎస్ జగన్‌కు అవంతి శ్రీనివాస్ సూచించారు. ఐదేండ్లు పాలించాలని కూటమికి రాష్ట్ర ప్రజలు తీర్పు చెబితే కనీసం ఐదు నెలలు కూడా టైం ఇవ్వకుండా ధర్నాలు అంటే ఎలా అని ప్రశ్నించారు. పార్టీ అంటే ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గత ఐదేండ్లు పార్టీ కార్యకర్తలు నలిగిపోయారన్నారు. తాడేపల్లిలో కూర్చుని ఆయన (జగన్) ఆదేశాలిస్తే.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు.

# తిరుపతిలో భారీ వర్షం

- జాగ్రత్తగా ఉండాలని ప్రయాణికులకు అధికారుల సూచన



తిరుమల, ప్రజాభూమి

తిరుపతిలో గురువారం భారీ వర్షం కురిసింది. వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత కూడా పెరిగింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్లపై వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు హితవు చెప్పారు. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. పాప వినాశనం, శ్రీవారి పదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. గో గర్భం, పాప వినాశం పూర్తిగా నిండిపోయి బయటకు నీరు ఔట్ ఫ్లో అవుతున్నది. భారీగా కురిసిన వర్షం వల్ల తిరుపతి వీధులు జలమయం అయ్యాయి. గొల్లవానిగుంట, లక్ష్మీపురం కూడలి తదితర లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తున్నది. వెస్ట్ చర్చి చౌరస్తాలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతం వర్షపు నీటితో నిండిపోవడంతో అధికారులు వాహనాలను దారి మళ్లించారు.

## ఖమ్మంలో వృద్ధ దంపతుల హత్య

# మిస్టరీని చేధించిన పోలీసులు

ఖమ్మం,ప్రజాభూమి

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జరిగిన వృద్ధ జంట హత్య మిస్టరీని పోలీసులు చేధించారు. ఓ నిందితుడి ఫోన్‌కాల్ ఆధారంగా పక్షం రోజుల వ్యవధిలోనే పోలీసులు ఈకేసులో పురోగతి సాధించారు. వృద్ధ దంపతులను బంగారం, డబ్బు కోసమే హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. జగ్గయ్యపేటకు చెందిన నేర ప్రవృత్తి కలిగిన ఓ నిందితుడితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కొత్త కొత్తూరులో 15 రోజుల కిందట వృద్ధ దంపతులు యర్ర వెంకటరమణ, కృష్ణకుమారి తమ సొంతింట్లో దారుణహత్యకు గురయ్యారు. హత్యకు సంబంధించి ఆనవాళ్లు లభించకుండా నిందితులు పక్కా పథకం ప్రకారం వ్యవహరించటంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. మూడు నెలల క్రితం వృద్ధ దంపతులు అనారోగ్యం బారిన పడి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ సమయంలో వారిని దొంగల ముఠా సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఫోన్ నంబర్ తీసుకున్నారు. కొత్త కొత్తూరులోని ఆ దంపతుల భవన సముదాయంలో అద్దెకు ఇళ్లు ఉన్నాయని తెలుసుకుని ఇద్దరు మహిళలు తరచూ అక్కడికి వెళ్లేవారు. మహిళలకు దంపతులు పలుమార్లు తమ ఇంట్లోనే భోజనం పెట్టడంతో వీరంతా కలిసిపోయారు. అతి త్వరలోనే ఇంట్లో అద్దెకు దిగుతామని వృద్ధులను నమ్మించారు.

ఇందులో భాగంగానే నవంబర్ 27న రాత్రి నలుగురు వచ్చి దంపతులను మట్టుబెట్టారు. ఈ కేసును ఛేదించేందుకు సీపీ సునీల్‌దత్ ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాల్ డేటా, సీసీ కెమెరాల పరిశీలనకు ప్రత్యేక బృందాలను నియమించారు. సుమారు పది రోజుల పాటు ఎలాంటి ఆధారాలు లభించలేదు. నలుగురిలో ఓ నిందితుడు చివరగా వెంకట రమణకు ఫోన్ చేసిన నంబర్ ఆధారంగా కేసు దర్యాప్తును పోలీసులు ప్రారంభించారు. నిందితుడు తన ఫోన్‌తో పాటు మిగిలిన ముగ్గురి ఫోన్లను ఒక్కొక్కటి ఒక్కోచోట పడేయటంతో కాల్ డేటా, జీపీఆర్ఎస్‌తో మరికొన్ని ఆధారాలు సేకరించారు. మూడు ఫోన్లలో ఓ ఫోన్ నంబర్ జగ్గయ్యపేట వాసి పేరిట నమోదవటంతో పూర్తి వివరాలు రాబట్టారు. పోలీసు శాఖలో అతడిపై కేసుల వివరాలు సేకరించారు. సదరు వ్యక్తిపై 2012లో హత్య కేసు నమోదైందని తెలుసుకోవటంతో తమదైన శైలిలో దర్యాప్తు సాగించారు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నిందితులను గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశముంది.

# వైసీపీని వీడుతున్న ముఖ్యనేతలు

- అదే కోవలో భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

పశ్చిమగోదావరి, ప్రజాభూమి



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీకి కీలక నేతలు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారు ఆ పార్టీ సీనియర్ నేతలు. ఏళ్లుగా ఆ పార్టీని అంటిపెట్టుకున్న నేతలు సైతం ఇప్పుడు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. సిద్ధమవడం ఏంటి.. ఆల్రెడీ కొందరు ముఖ్య నేతలు పార్టీ వీడగా.. మరి కొందరు పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. గురువారం ఉదయాన్నే మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అవంతీ శ్రీనివాస్ ఊహించని రీతిలో తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. ఇలా ఉండగానే మరో కీలక పరిణామం వైసీపీని భారీగా కుదిపేసింది. ఇదేకోవలో మరో నేత వైసీపీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. జగన్ పార్టీకి రాజీనామా చేసేందుకు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాలకు గ్రంధి శ్రీనివాస్ దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలోనే మరికొన్ని రాజీనామాలు ఉంటాయని వార్తలు వస్తున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆ తర్వాత ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేస్తారని వైసీపీలోనే పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీన్ని బట్టి చూస్తే రాజీనామాలు ఇప్పట్లో ఆగే పరిస్థితి అయితే కనిపించట్లేదు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. వైసీపీ నేతల్లో అంతర్మథనం మొదలైనట్లుంది. గత ఐదేళ్ల పాలన దృష్ట్యా రాష్ట్రంలో పార్టీకి భవిష్యత్ లేదనే నిర్ణయానికి ఆ పార్టీ నేతలు వస్తున్నారట. అందుకే.. పక్క చూపులు చూస్తున్నారట. ఇప్పటికే చాలా మంది ముఖ్య నేతలు వైసీపీని వీడగా.. మరికొందరు అదే ఆలోచనలో ఉన్నారు. ఇక కొందరు నేతలైతే అసలు పార్టీలో ఉన్నారో, లేదో కూడా తెలియ డం లేదు. పార్టీతో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నా రు. కీలక నేతలు ఎన్నికల తర్వాత వైసీపీకి దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితి బట్టి చూస్తే వైసీపీ దుకాణం త్వరలోనే బంద్ అవడం ఖాయం అని పొలిటికల్ సర్కిల్‌లో టాక్ నడుస్తోంది.

## రాజమండ్రి నుంచి

# ఢిల్లీకి విమానసర్వీసులు




అమరావతి,ప్రజాభూమి

ఏపీలోని రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీ, ముంబాయి విమాన సర్వీస్ గురువారం నుంచి ప్రారంభమయ్యింది. ఢిల్లీ నుంచి రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్టుకు మొదటిసారిగా వచ్చిన ఇండిగో ఎయిర్ బస్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి రాజమండ్రికి వచ్చారు. ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనాన్లతో సిబ్బందితో స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇంతకుముందు ఢిల్లీకి, విదేశాలకు వెళ్లాలంటే విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌కు వెళ్లాల్సివచ్చేదని అన్నారు. ఇకపై ముంబాయి, ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విదేశాలకు వెళ్లవచ్చని తెలిపారు. కాకినాడు ఎయిర్‌పోర్టు విషయంలో ల్యాండ్‌తో సహా ఫిజిబిల్టిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ తిరుపతి, షిర్డీ, జైపూర్, గుజరాత్ రాష్ట్రాలకు, ప్రధాన నగరాలకు బిజినెస్ కనెక్టివిటీని పెంచడానికి అవకాశముందని అన్నారు. 2027లో రాజమండ్రి పుష్కరాలకు కూడా విమానశ్రయాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల,ప్రజాభూమి

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరస్వామిని దర్శించు కునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 15 కంపార్టుమెంట్లలో వేచియుండగా టోకెన్లు లేని వారికి 6 గంటల్లో సర్వదర్శనం కలిగిందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 65,887 మంది భక్తులు దర్శించుకోగా 25,725 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.88 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో డిసెంబరు 13 తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర జరుగనుంది. ఈ ఆలయంలో డిసెంబరు 4 నుంచి తిరుమంగై ఆళ్వార్ ఉత్సవంజరుగుతోంది. సాత్తుమొర సందర్భంగా డిసెంబరు 13న సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత



గోవిందరాజస్వామివారు, తిరుమంగై ఆళ్వార్‌ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# ప్లాన్ ఏలా చేయాలని చూపించటానికే భిక్షగాడి హత్య

- ఓంకార్ అకృత్యాలు వెలుగులోకి...

అమరావతి, ప్రజాభూమి



తాను బెదిరించి లొంగదీసుకున్న మహిళతో ఆమె భర్తను హత్య చేయించేందుకు ఓ వైసీపీ నేత అమాయకుడైన ఓ బిక్షగాడిని హత్య చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన ఆ పార్టీ నేత దేవరకొండ నాగేశ్వర రావు అలియాస్ ఓంకార్ సాగించిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతని ఆరాచకాలపై బాధిత కుటుంబం ఈ నెల 2న గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితులు ఫిర్యాదుతో నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఓ కేసు, మహిళా పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదు చేశారు. ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తర్వాత కేసులైతే నమోదు చేశారు గానీ ఇంతవరకు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. ఇప్పటికీ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధిత కుటుంబం నిర్వహించే దుకాణం వద్ద, ఇంటి సమీపంలో రెకీ నిర్వహిస్తుండటంతో ఆ కుటుంబం హడలిపోతోంది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో దుకాణం నిర్వాహకురాలిని లొంగదీసుకునేందుకుగానూ నిందితుడు నాగేశ్వరరావు తన అనుచరులతో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడు. బాధిత మహిళ నగరంపాలెం స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఓ మహిళను లొంగదీసుని వారు ఏకాంతంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకొని ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఆమె ద్వారానే ఆమె భర్తను హత్య చేయించేందుకు ఆ వైసీపీ నేత కుట్ర పన్నాడు. ఇందుకు గానూ ఓ బిక్షగాడిని కడతేర్చాడు. భర్తను చంపకపోతే ఆమెను, ఆమె పిల్లల్ని చంపేస్తానంటూ బెదిరించాడు. ఎవరికి అనుమానం రాకుండా, చేతికి మట్టి అంటకుండా ఎలా చంపాలి అనేది ఆమెకు తెలియ జెప్పడానికి ఏకంగా ఓ బిక్షగాడిని సైనెడ్ ఇచ్చి చంపేసినట్లు బాధిత మహిళ ఆరోపిస్తుంది. చిలకలూరిపేట వెళ్లే జాతీయ రహదారిపై కాటూరి మెడికల్ కళాశాల సమీపంలోని సర్వీసు రోడ్డులో ఓ బిక్షగాడు గోనె పట్టాలతో డేరా కట్టుకొని నివాసం ఉండేవాడు. దారిన వచ్చి పోయేవారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునేవాడు. అయితే వైసీపీ నేత నాగేశ్వరరావు ఓ బంగారు షాపులో పనిచేసే వ్యక్తి వద్ద నుంచి సైనెడ్ తెప్పించి బిక్షగాడికి నీటిలో కలిపి తాగించాడు. దీంతో అతను చనిపోయాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని తన సెల్ ఫోన్లో వీడియో తీసి ఆమెకు చూపించాడు. ఇదే విధంగా ఆమె భర్తను చంపాలని ఆమెను బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ తన భర్తకు ఆహారంలో సైనెడ్ కలిపింది. అయితే ఆ ఆహారం నోట్లో పెట్టుకోగానే వికారంగా ఉండటంతో భర్త దానిని ఊసేశాడు. దీంతో ఏమాత్రం అనుమానం రాకుండా ఆమె వెంటనే ఆహార పదార్థాలను బయట పడేసింది. ఈ ప్రయత్నం విఫలం కావడంతో ఆ తర్వాత విజయవాడలో కుక్కలు పట్టుకునే వారి వద్ద నుంచి తీసుకొచ్చిన ఇంజక్షన్ ఆమెకు ఇచ్చి భర్త నిద్రపోయే సమయంలో చేయాలంటూ బెదిరించాడు. కానీ ఆమె ఇంజక్షన్ చేయలేకపోయింది. భర్తతో ద్విచక్ర వాహనంపై వచ్చే సమయంలో నీ చేతిలో ఉన్న సంచి కింద పడేసుకుంటే దానికోసం బండి ఆపుతాడని, ఆ సమయంలో తాము వచ్చి అతనికి ఇంజక్షన్ గుచ్చి వెళ్తామని చెప్పాడు. ఆ విధంగా చేయాలని నాగేశ్వరావు ఒత్తిడి తెచ్చినా బాధిత మహిళ అంగీకరించలేదు. దీంతో హత్య చేయడానికి నాగేశ్వరావు తన అనుచరులతో స్వయంగా రంగంలోకి దిగాడు.

# ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా





ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్ ఇరు జట్లకు కీలకమైంది. ఈ సిరీస్‌పై పట్టు బిగించాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు అత్యవసరం. ఈ క్రమంలోనే మూడో టెస్ట్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలను టీమిండియా మేనేజ్‌మెంట్ రెడీ చేస్తోంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్‌గానే ఆడించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. రెండో టెస్ట్‌తో రీ ఎంట్రీ ఇచ్చాడు. కానీ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో రోహిత్‌ను మిడిలార్డ్‌లో ఆడించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ సైతం ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. దాంతో రోహిత్ శర్మను ఓపెనర్‌గానే కొనసాగించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చూస్తే ఈ విషయం అర్థమైంది. ఈ నెట్ సెషన్‌లో రోహిత్ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్నాడు. ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్‌తో పాటు బౌన్సర్లను ప్రాక్టీస్ చేశాడు. స్టంప్ లైన్ డెలివరీలను కూడా ఆడాడు. ప్రస్తుతం రోహిత్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ రెండు సార్లు మాత్రమే 20 ప్లస్ రన్స్ చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉండగా.. 8 సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడితే.. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.

## ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రా రెండు లెగ్ స్పిన్ డెలివరీ



జస్ప్రీత్ బుమ్రా కొత్త ఆవిష్కరణతో ఆస్ట్రేలియా తలపడే మూడో టెస్ట్‌కు ముందు అందరి దృష్టిని ఆకర్షించాడు. బ్రిస్బేన్‌లో శనివారం ప్రారంభం కానున్న మూడో టెస్ట్ మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రా రెండు లెగ్ స్పిన్ డెలివరీలను బౌలింగ్ చేస్తూ తన బౌలింగ్ శైలిలో కొత్త మలుపును చూపించాడు. జర్నలిస్ట్ భరత్ సుందరేశన్ %శ% (మాజీ ట్విట్టర్)లో పోస్ట్ చేసిన వీడియోలో, బుమ్రా తన సాధారణ ఫాస్ట్ బౌలింగ్‌కు పక్కన, చిన్న రన్-అప్‌తో లెగ్ స్పిన్ బౌలింగ్ చేశాడు. ఇదిలా ఉండగా, రెండో టెస్టులో కొంత ఇబ్బంది పడిన తరువాత, బుమ్రా తన ఫిట్‌నెస్‌పై సందేహాలను తొలగిస్తూ, %ఖూ% రాహుల్, యశస్వి జైస్వాల్‌లతో ప్రాక్టీస్ సమయంలో గొప్ప బౌలింగ్ ప్రదర్శన ఇచ్చాడు. ఇది అతని పూర్తి ఫిట్‌నెస్‌ను, మూడో టెస్టులో అతను కీలకంగా ఉండగల సామర్థ్యాన్ని చూపింది. ఆడిలైడ్ పింక్-బాల్ టెస్టులో భారత్ బ్యాటింగ్ విఫలమైన తర్వాత, జట్టు మూడో టెస్టులో విజయంతో సిరీస్ ఆధిపత్యాన్ని అందుకోవాలని కోరుకుంటోంది. అంతేకాకుండా, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హేడెన్ ప్రత్యేకించి బ్రిస్బేన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత బ్యాటర్‌లకు సమయానికి తగ్గట్టు బాగా బ్యాటింగ్ చేయాలని సూచించాడు. మూడో టెస్టులో, భారత బ్యాటింగ్ విభాగం మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో, జస్ప్రీత్ బుమ్రా లెగ్ స్పిన్ సహా తన బౌలింగ్‌లో కొత్త పంథాను జోడించడం జట్టుకు అదనపు ఆయుధంగా మారనుంది. అభిమానులు బుమ్రా ప్రదర్శనను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు, ఇది భారత జట్టుకు బ్రిస్బేన్ టెస్టులో కీలకంగా మారవచ్చు.

# హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్

**బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు**

**ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్**



దశాబ్దానికిపైగా సత్తాచాటిన విరాట్ కోహ్లి, కేన్ విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్‌లను క్రికెట్ ప్రపంచం ఫ్యాబ్-4గా పిలుస్తుంటుంది. అత్యుత్తమ క్రికెటర్ అనే ప్రశ్నకు ఈ నలుగురిలో ఒక్కరి పేరే అత్యధికంగా జవాబుగా వినిపిస్తుంటుంది. అంతటి రీతిలో క్రికెట్ క్షేత్రంలో ఈ యోధులు సత్తాచాటారు. అయితే ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ అత్యుత్తమ క్రికెటర్ అంటూ కుర్రాడు పేరు చెప్పాడు. ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ క్రికెటర్ ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అని పాంటింగ్ పేర్కొన్నాడు. ఫ్యాబ్-4 కాకుండా తొలిసారి కొత్త పేరు తెరపైకి వచ్చింది. 25 ఏళ్ల ఇటీవల బ్రూక్ ఇటీవల టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకాడు. జులై నుంచి టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న జో రూట్‌ను అధిగమించి ఒక్క పాయింట్ ఆధిక్యంతో బ్రూక్ అగ్రస్థానానికి చేరాడు. "ప్రస్తుత టెస్టు బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్‌గా భావిస్తున్నా. అతను చక్కని ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. సొంతగడ్డతో పాటు విదేశాల్లో గొప్ప ప్రదర్శన చేస్తున్నాడు. అతను సాధించిన ఎనిమిది-తొమ్మిది సెంచరీల్లో విదేశాల్లో ఏడు శతకాలు విదేశాల్లోనే బాదడం విశేషం. అతను పరుగులు సాధించే విధానం, క్లాస్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నాను. జనరేషనల్ ప్లేయర్ అయిన అతన్ని గత ఐపీఎల్ వేలంలో దక్కించుకున్నాను. ప్రస్తుత టెస్టు ఫార్మాట్‌లో సత్తాచాటుతున్న బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు" అని రికీ పాంటింగ్ అన్నాడు. గత కొంతకాలంగా అద్భుత ఫామ్ కొనసాగిస్తున్న హ్యారీ బ్రూక్ శతకాలు సాధిస్తున్నాడు. 23 టెస్టులు ఆడిన బ్రూక్ 61.62 సగటుతో 2280 పరుగులు చేశాడు. ఎనిమిది సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఓ డబుల్ సెంచరీ కూడా బాదాడు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ల నుంచి బ్రూక్ ప్రశంసలు అందుకుంటున్నాడు. గత ఐపీఎల్ వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. అప్పటి ఢిల్లీ కోచ్‌గా పాంటింగ్ ఉన్న సంగతి తెలిసిందే.

# షమి పునరాగమనంపై అనిశ్చితి



భారత క్రికెట్ జట్టుకు ఒక ముఖ్యమైన సమస్యగా మహ్మద్ షమీ ఫిట్‌నెస్ నిలుస్తోంది. అతని మోకాలి వాపు సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కష్టంగా మారింది. రోహిత్ శర్మ కూడా 100% ఫిట్‌నెస్ హామీ లేకుండా షమిని జట్టులోకి తీసుకోలేనని వెల్లడించారు. అయినప్పటికీ, అతని పునరాగమనంపై నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. 2024లో భారత క్రికెట్ జట్టుకు ఎదురయ్యే అనేక సమస్యల్లో మహ్మద్ షమీ ఫిట్‌నెస్ ఒకటి. భారత జట్టులో పేస్ బౌలింగ్ బలోపేతం అవసరం కావడంతో, షమీ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతం అతని మోకాలి సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కుదరట్లేదు. రోహిత్ శర్మ, షమీ గురించి మాట్లాడుతూ, అతనిపై 100% ఫిట్‌నెస్ హామీ ఇచ్చే వరకు జట్టులోకి తీసుకోడానికి ఇష్టపడం లేదని పేర్కొన్నాడు. షమీ పై ఒత్తిడి లేకుండా, మునుపటి ఆట తర్వాత అతను ఎలా తిరిగి పుంజుకుంటాడో, నిపుణులు అతనిని పర్యవేక్షిస్తున్నారని కూడా చెప్పారు. రోహిత్ గమనించినట్లుగా, షమీకి 100% ఫిట్‌నెస్ సాధించాక మాత్రమే జట్టులో చేరే అవకాశం ఉంటుంది. షమీ ప్రస్తుతం బెంగాల్ జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడుతున్నాడు, కానీ ఆయన మోకాలి వాపు సమస్యలు కొనసాగుతున్నాయి. షమీ, ఐపీఎల్, రంజీ ట్రోఫీ వంటి పోటీ క్రికెట్‌లో తన నైపుణ్యాలను పునఃప్రదర్శించడానికి ప్రయత్నించినప్పటికీ, మోకాలి సమస్యలు అతని పరిమితులను పెంచుతున్నాయి. ఈ సమస్యల కారణంగా, అతని పునరాగమనంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. భారత జట్టు ఇప్పటికే నూతనంగా జట్టులోకి వస్తున్న బౌలర్లతో మ్యాచ్ లు ఆడుతోంది. అయితే షమీ తిరిగి ఫిట్‌నెస్ సాధిస్తే, అతన్ని జట్టులో సమలిసే అవకాశాలు ఉండవచ్చు. కానీ ఈ సమయంలో, అతని స్థితి పునరాలోచన అవసరం.

# ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వన్డే సెంచరీలు

## చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన..!



వన్డే క్రికెట్లో స్మృతి మంధాన దెబ్బకు రికార్డులన్నీ చెల్లాచెదురయ్యాయి. ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కానీ రికార్డును తన ఖాతాలో వేసుకుంది ఈ క్యూటీ. బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన మూడోవన్డేలో ఈ ఘనతను సాధించింది. భారత డాషింగ్ మహిళా బ్యాటర్ స్మృతి మంధాన దుమ్మురేపింది. మహిళా క్రికెట్లో వరల్డ్ రికార్డను నెలకొల్పి శభాష్ అనిపించింది. బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన 3వ వన్డేలో స్మృతి మంధాన ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచులో సెంచరీ (109 బంతుల్లో 105, 14 ఫోర్లు, 1 సిక్సర్ ) సాధించి మంధాన ఎవరికీ సాధ్యం కానీ రికార్డులు తన ఖాతాలో వేసుకుంది. ఒక క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన బ్యార్ గా రికార్డు క్రియేట్ చేసింది. మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 8000 పరుగులను పూర్తి చేసింది. మంధాన ఇప్పుడు అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలుగా రికార్డుల్లోకి ఎక్కింది. కేవలం 28 ఏళ్ల 146 రోజుల వయసులో స్మృతి ఈ ఘనత సాధించింది. 2024లో వన్డే ఫార్మాట్‌లో స్మృతి మంధానకు ఇది నాలుగో సెంచరీ. బెలిండా క్లార్క్, మెగ్ లానింగ్ వంటి చాలా మంది దిగ్గజ ఆటగాళ్లను వెనక్కి నెట్టింది. స్మృతి మంధాన కెరీర్‌లో ఇప్పటివరకు 91 వన్డేల్లో 3812 పరుగులు చేసి, 145 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో 3568 పరుగులు చేసింది. ఇది కాకుండా, మంధాన తన కెరీర్‌లో ఇప్పటివరకు 7 టెస్ట్ మ్యాచ్‌లు కూడా ఆడింది. అందులో ఆమె 629 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా ఘోర పరాజయంపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన ప్రకటనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. బౌలింగ్ లో రాణించామని..ముఖ్యంగా అరుంధతి మంచి ఫెర్మామెన్స్ చూపించిందని చెప్పింది. ఈ టూర్‌లో తను బౌలింగ్, బ్యాటింగ్ చేసిన విధానం నుండి మనం చాలా నేర్చుకోవాలి. మేము తిరిగి వెళ్లి మొత్తం పర్యటనను విశ్లేషిస్తాము. మేము ఎక్కడ తప్పు చేశామో అర్థం చేసుకుంటాము. స్మృతి ఇన్నింగ్స్ అద్భుతంగా ఉంది. మేము కొన్ని చోట్ల మంచి ప్రదర్శన కనబరిచాము, కానీ మేము మా జోరును కొనసాగించలేకపోయాము. భవిష్యత్తులో మేము మరింత కష్టపడాలి అని హర్మన్ ప్రీత్ అన్నారు.

# ముఫసాలో సత్యదేవ్ వాయిస్




హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్ ది లయన్ కింగ్‌కు ప్రీక్వెల్‌గా వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్. అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకత్వం వహించిన ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా సందడి చేయనుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ కీ రోల్ టాకా (సింహం) పాత్రకు సత్యదేవ్ వాయిస్ ఓవర్ అందించాడు. బ్రతికిపోయాం.. మనల్ని కాపాడింది నేనే.. టాకా పాత్రకు వాయిస్ ఓవర్ అందించిన వీడియోను సత్యదేవ్ షేర్ చేశాడు. అంతేకాదు ముఫాసా ది లయన్ కింగ్ సినిమాకు పనిచేయడం పట్ల తన ఎక్జయిట్‌మెంట్‌ను అందరితో షేర్ చేసుకున్నాడు. నాకు లయన్ కింగ్ అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ ఆ సినిమా చూసినప్పుడల్లా.. అందులో ఏదో ఒక పాత్రకు నేను వాయిస్ ఇవ్వాలని అనుకునేవాడిని. యానిమేషన్ సినిమాకు ఎప్పుడూ వాయిస్ ఇవ్వలేదు. కానీ తొలిసారి ఇచ్చాను. చాలా సంతోషంగా ఉంది.. అంటూ షేర్ చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీ తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడని తెలిసిందే. హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించాడు

# 20న ప్రేక్షకుల ముందుకు ఉపేంద్ర



వినూత్న కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర. ఆయన పోషించే పాత్రలు కూడా విలక్షణంగా అనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న పీరియాడిక్ ఫాంటసీ చిత్రం 'యూఐ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. లహరి ఫిల్మ్స్ పతాకంపై జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. చాలా విరామం తర్వాత ఉపేంద్ర దర్శకత్వం వస్తున్న ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని మేకర్స్ తెలిపారు. సమకాలీన సమాజంలోని సంఘటనలతో పాటు భవిష్యత్తు భారతంలోని సమస్యలను కథాంశంగా తీసుకొని తనదైన శైలిలో ఉపేంద్ర ఈ సినిమాను తెరకెక్కించారని, కొంతభాగం కథ 2040లో నడుస్తుందని, విజువల్స్ అబ్బురపరుస్తాయని చిత్ర బృందం పేర్కొంది. రీష్మా నానయ్య, మురళీశర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య తదితరులు ఈ చిత్రలో నటించారు.





# వివాహబంధంతో ఒక్కటైన కీర్తిసురేశ్ -ఆంథోని తటిల్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ కీర్తిసురేశ్ -ఆంథోని తటిల్ వివాహబంధంతో ఒక్కటయ్యారు. సౌతిండియా సంప్రదాయ పద్ధతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్లు వేశాడు ఆంథోని తటిల్. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న కీర్తి సురేశ్ దంపతులకు కుటుంబసభ్యులు, ఇండస్ట్రీ ప్రముఖులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వధూవరులిద్దరు మెరిసిపోయారు. కొత్త జీవితాన్ని మొదలుపెడుతున్న క్షణాలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. హ్యాష్‌ట్యాగ్ జత చేసింది కీర్తిసురేశ్. బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్‌తో కలిసి కీర్తిసురేశ్ నటిస్తోన్న బేబిజాన్ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తిసురేశ్‌కు ఇది హిందీలో తొలి సినిమా.

### మీడియాకు స్ట్రాంగ్ వార్నింగ్

# ఇచ్చిన సాయిపల్లవి

అగ్ర కథానాయిక సాయి పల్లవి గురించి ప్రత్యేక పరి చయం అవసరం లేదు. ప్రేమమ్, ఫిదా, గార్గి సినిమాలతో తనకంటూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చు కుంది. రీసెంట్‌గా అమరన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ.. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమా చేస్తుంది. అయితే సాయి పల్లవి వెజిటేరియన్ అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ప్రసా వించింది. అయితే తాజాగా బాలీవుడ్ రామాయణం సినిమా కోసం సాయి పల్లవి నాన్ వెజ్ మానేస్తుం దంటూ తమిళ మీడియా ఒక కథనం ప్రచురించింది. దీంతో ఈ విషయం వివాదం అవ్వగా.. దీనిపై సాయి పల్లవి స్పందిస్తూ.. మీడియాకు వార్నింగ్ ఇచ్చింది. తమిళ అగ్ర మీడియా రామాయణ్ సినిమా గురించి రాస్తూ.. ”సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్‌లో రామా యణం అనే ప్రాజెక్ట్‌లో నటించబోతుంది. దీనికోసం షూటింగ్ ముగిసే వరకు ఎలాంటి నాన్ వెజ్ ముట్టు కోకుడదని తాను నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అలాగే మంసాహారం తినకుండ విదేశాలకు వెళ్లినప్పుడు తనతో పాటు చెఫ్‌ను కూడా వెంట తీసుకువెళుతుంది. ఈ చెఫ్ సాయిపల్లవి కోసం వెజ్ డిన్నర్ తయారు చేస్తారు” అంటూ రాసుకోచ్చింది. అయితే దీనిపై ఘాటుగా స్పందించింది సాయి పల్లవి చాలా సార్లు, దాదాపు ప్రతిసారి.. నా మీద వచ్చే పుకార్లు లేదా తప్పు డు వార్తలను పట్టించు కోను. ఈ విషయం దేవునికి కూడా తెలుసు. ముఖ్యంగా నా సినిమా రిలీజ్‌లు, అనౌన్స్‌మెంట్‌లు వచ్చినప్పుడు ఇలాంటివి ఎక్కువగా వ్యాపిస్తాయి. అయితే ప్రతిసారి ఇలా అవుతుంటే మాత్రం స్పందించక తప్పదు. నెక్స్ట్ టైం ఇలాంటి తప్పుడు వార్తలను అగ్ర మీడియాలు కానీ వాటికి చెందిన సోషల్ మీడియా పేజీలు కానీ ప్రచురిస్తే నా తరపు నుంచి చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అంటూ సాయి పల్లవి రాసుకోచ్చింది.



### నయనతారకు మద్రాసు

# హైకోర్టు నోటీసులు

'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్‌స్టార్ నయనతార, తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం కొనసా గుతోంది. ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్ ఇటీవలే మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై దావా వేశారు. దీనిపై తాజాగా మద్రాసు హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై జనవరి 8వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు నయన్ దంపతులతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు నోటీసులు జారీ చేసింది. విఘ్నేష్ దర్శకత్వంలో వహించిన 'నానుమ్ రౌడీ దాన్'(2016) సినిమా నయన్ జీవితంలో కీలకం. ఆ సినిమా సమయంలోనే వారిద్దరూ ప్రేమలో పడ్డారు. అందుకే అందులోని సన్నివేశాల ను, పాటలను డాక్యుమెంటరీలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో.. దానికి సంబంధించిన ఎన్‌వోసీ(అనుమతి పత్రం) కోసం ఆ చిత్ర నిర్మాతైన హీరో ధనుష్‌ని డాక్యుమెంటరీ మేకర్స్ సంప్రదించారు. రెండేళ్లపాటు పోరాడినా ధనుష్ మాత్రం అందుకు అనుమతి ఇవ్వలేదు. డాక్యుమెంటరీ స్ట్రీమింగ్‌కి వస్తున్న నేపథ్యంలో రీసెంట్‌గా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని మూడు సెకన్ల క్లిప్స్ ఉండటంతో, అందుకు నష్టపరిహారంగా 10కోట్ల రూపాయ లు డిమాండ్ చేస్తూ నయనతార టీమ్‌కు ధనుష్ లీగల్ నోటీ సులు పంపారు. దాంతో మనసు నొచ్చుకున్న నయనతార.. ధనుష్‌కు భారీ లెటర్‌ని రాసింది. ఇందులో ఆయనపై తీవ్ర విమర్శలు చేసింది. దీంతో ఆగ్రహించిన ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయన్ దంపతులపై దావా వేశారు.

